# ముక్కుకు సూటిగా

ముసలయ్య గుడిసె ముందు నిలబడి రంకెలు వేడుస్తున్నా. వరసగా పాకలున్న అక్కడ అంతా అలా అరుచుకోవడం కొట్లాడు కోవడం విడ్డూరమేమీ కాదు. కాలువ గట్టున స్థలాల్ని ఆక్రమించుకుని చిన్న చిన్న గుడిసెలు వేసుకుని, వాటిలో బ్రతికేవారి బ్రతుకులు నిజంగా బట్టబయలే.

అతని పేరు ముసలయ్యగాని అతడు మాత్రం ముసలయ్య కాదు, పడుచువాడే. రిక్షా తొక్కుతాడు. తాగుడు అలవాటులేని నూటికి ఒకటి. అరి రిక్షా వాళ్ళలో ముసలయ్య ఒకడు. ఎంతో కష్టపడతాడు. నిజాయితీగా

వుంటాడు. పెళ్ళాన్ని కొట్టడు. అచ్చితంగా వుంటాడు. అలాంటి ముసలయ్యా ఎదుటి వారిలో తప్పుని సహించలేడు.

అతని తల్లి కొరమ్మ దూరంగా బట్టలుతికే రాయిమీద కూర్చుని ఏదో సణుగుతోంది. ముసలయ్యా మాత్రం నోటికొచ్చినట్లు తిడుతున్నాడు.

"నీ కొచ్చి నేళ్ళు ఏం జేసుకుంటావు? నీ కంటె ఆ కుక్కా, పందీ నయం. ఆటికి యిసువాసం వుంటది. నా సెమటోడ్సి నే దెస్తే - సాటు మాటు యవ్వారమా - అట్టాంటి మాటంటేనే నాకు మంట" అంటూ అరుస్తున్నాడు. కాలవలో నీటి కెరటాలమీంచి ధ్వనితరంగాలు దాటుకొస్తున్నాయి.

అతను కష్టపడి సంపాదించిన డబ్బుతో పది కిలోలు బియ్యంకొని పాత కుండలో పోశాడు. అతని భార్య తూచి తూచి జాగ్రత్తగా వాడు తోంది. నిన్న రాత్రి కొరమ్మ అందులోంచి పావుశేరు బియ్యం దొంగిలించి పకోడీలు కొనుక్కు తినేసింది. ఆ విషయం ముసలయ్యా భార్య కనిపెట్టినా రుజువులేక ఏమీ చెయ్యలేకపోయింది. ఉదయమే అర్ధశేరు కొంగులో పోసుకుంటుంటే పట్టుకుంది.

"మూడు పూటల కాడినుంచి సుట్టముక్కలేక సచ్చిపోతున్నా" అని ముసలి కొరమ్మ మొరాయించింది. ఈ మాట విని కొరమ్మని బయటకు గెంటేశాడు ముసలయ్యా. "ఈ సాటు మాటు పనులంటే నా గిట్టవు - పో ముండా బయటకి" అన్నాడు. "ఎదరపడి అడిగితే పావల డబ్బులు ఈకపోదునా" అంటూ అరిచాడు.

కొరమ్మ నోరెత్తలేక వూరుకుంది. ఆమెకి ఈ వ్యవహారం కొత్త కాదు. చాటుమాటుగా అడ్డమైన పనులూ చేసి మొగుడిచేత దావు దెబ్బలు తినడం బాగా అనుభవం. మొగుడు పోయాడు. ముసలయ్యా అరుస్తాడుగాని కొట్టడు. అందుకే కొరమ్మకి అంతగా అంటదు.

"ఇంత కూడేస్తుంది. తిని పడుండు. ఎదవ పనులు సేశావంటే- ఈ పాలి మక్కి తిరగదంతా" అన్నాడు. ఇంతలో పక్కింటి సింహాచలం అడ్డొచ్చి—

"ఒరే ముసలయ్యా. కన్నతల్లి నట్టా గట్టా అనేది? చేసింది తప్పయినా నెమ్మదిగా చెప్పుకోవాల" అన్నాడు.

"ఎందుకు సెప్పాలి" అన్నాడు.

"లేక ఊరంతా యినాలా......"

"నాకేం భయంలేదు. ఇంటే యిననీ - నేనేం చేసినా అందరి ఎదుటా చేస్తాను. నా కేటిరా బయ్యం - నే నెవడి సొమ్ము తినడం లేదురా - నా కష్టం నే తింటన్నా" అన్నాడు.

సింహాచలం నవ్వి "అన్నీ అనబోకు. కొన్ని గుప్పిట్లో ముయ్యాలి" అన్నాడు.

ముసలయ్య మీసం మీద చెయ్యేసి "ఈ ముసలయ్య ఏ పనీ ఎనక మాల చెయ్యడు" అన్నాడు.

o o o

ముసలయ్య వుషారుగా రిక్షా పోనిస్తున్నాడు. పొద్దుటినుంచీ ఒకటే బేరాలు. క్షణం ఊపిరి సలపడం లేదు. ఊరంతా కలకలలాడి పోతోంది. హడావిడి. రంగు కాగితాలు తోరణాలు - ఆటోలు, రిక్షాలు, కారులు అన్నిటికి హడావిడి. ఆ రోజు పోలింగ్ రోజు ఎలక్షన్ల హడావిడి అంతా ఇంతా కాదు. ముసలయ్య ఏ పార్టీకి ఖాతా పెట్టుకోకపోయినా, మామూలు బేరాలే ఆ రోజు చాలా ఎక్కువగా ఉన్నాయి. ముసలయ్య మనసు తేలికగా వుంది. జుబ్బా లోపలి జేబు బరువుగా వుంది.

"ఒరే ముసలయ్యా, ఏటిరా ఆ బాబుగారితో అల్లా దెబ్బలాడేత్తున్నావు" అన్నాడు వెనకగా తన రిక్షా తొక్కుతూ సింహాచలం.

"ఏం. నా కనిపించింది మొగాన కొట్టినట్టు అడిగాను తప్పా!"

"నీ ముఖంలే" అనుకుంటూ నవ్వుతూ ముందు కెళ్ళిపోయాడు సింహాచలం.

ముసలయ్య రిక్షాలోంచి దిగిన ఆసామిని టైమెంతని అడిగాడు. నాలుగున్నరని అతను చెప్పాడు. ఆరుగంటలకి పోలింగ్ పూర్తయిపోతుంది. ముసలయ్య జీవితంలో వచ్చిన మొదటి ఓటుహక్కు. అతనికి భలే వుషారుగా వుంది. ఎప్పుడెప్పుడా అని కంగారుగా వుంది.

ఇంక రిక్షా ఆపేసి. బండి షెడ్డులో ఇచ్చేసి ఓటు వెయ్యాలి అనుకుంటూ బయలుదేరాడు. ఓటు ఎలా వెయ్యాలో? - ఆ, అక్కడ వాళ్ళే సెప్తారు ఏం సెయ్యాలో, సింహాచలానికి సెప్పలేదూ ! ముసలయ్య రిక్షా తీసుకుని షెడ్డువైపు బయలుదేరాడు. మధ్యలో ఎంతమంది అడిగినా బండి రాదండి, రాదండి అంటూ గంట మోగించుకుంటూ ముందుకు సాగిపోయాడు.

పోలింగ్ ఆఫీసు దగ్గర జనం పల్చబడిపోయారు. అక్కడొకళ్ళు, అక్కడొకళ్ళు వచ్చి ఓటు వేసిపోతున్నారు. పోలింగ్ ఆఫీసుకి దూరంగా అన్ని పార్టీలవాళ్ళూ నెమ్మదిగా, సున్నితంగా, మర్యాదగా తమని మర్చిపోవద్దని ఓటర్లకి గుర్తుచేస్తున్నారు. అయినా నలభై దాటుతుండగా ముసలయ్య పైగుడ్డతో ముఖం తుడుచుకుంటూ పరుగులాంటి నడకతో పోలింగ్ ఆఫీసులో అడుగుపెట్టాడు.

అక్కడ వరుసగా నలుగురైదుగురు కూర్చుని వున్నారు. ఇద్దరు పేరు వెతుకుతున్నారు. ముసలయ్య వారికి తన పేరువున్న చీటీ ఇచ్చాడు.

పేరు సులువుగానే దొరికింది. ఒకామె ముసలయ్య చేతి చూపుడు వేలిమీద నల్లని సిరామచ్చ వేసింది. మరోకామె వేలిముద్ర వేయించుకుని ఓటు చేతికిచ్చి,

"నీ కిష్టమైన గుర్తుమీద- ఇదిగో, ఈ ముద్రవేసి ఇలా మడతవేసి ఈ పెట్టెలో వెయ్యాలి- ఇదిగో ఆ ముద్ర మాత్రం అటు ఆ తెరలు కట్టారే- అందులోకి వెళ్ళి వేసిరా" అంది. ముసలయ్య ఆమెని అనుమానంగా చూశాడు.

"ఊ, వెళ్ళి వేసిరా" అంది.

"ఎందుకెళ్ళాలి? నాకిష్టమైన గురుతుమీద నేను కొట్టేదానికి అంత రాస్సెం ఎందుకు?" అన్నాడు సీరియస్‌గా.

"అదంతే. అలాగే చెయ్యాలి-" అన్నాడు అక్కడున్న పోలింగ్ ఆఫీసరు.

ముసలయ్యకి ఛర్రున కోపం వచ్చింది. "ఈ ముసలయ్య ఏదీ ఎనకమాల తెరసాటుకెళ్ళి సెయ్యడు. నాకేటి బయ్యం. నే కష్టపడి రిక్షా లాక్కొని బతుకుతున్నా- ఎవడి సొమ్మూ తినడంలేదు- నేనిక్కడే గుద్దుతా నా ముద్దర" అన్నాడు.

"అది పద్ధతికాదు" అంటూ ఏదో చెప్పబోయేంతలో—

"నేనేదీ సాటుగా సెయ్యనంటే సెయ్యను- అంతే- ఆ..." అంటూ దభీమని ముద్రవేసి- మడతపెట్టి, వాళ్ళు చూపించిన పెట్టెలోనే పడేసి మీసం దువ్వుకుంటూ బయటికొచ్చేశాడు, భారత వీరుడైన బంగారు పౌరుడు.

ఆతని మూర్ఖత్వంలో వున్న అమాయకత్వానికి పోలింగ్ ఆఫీసరు నవ్వుకున్నాడు.